సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం : 22 ఏప్రిల్ : 2023



వేములవాడలో భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్నను శుక్రవారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రభుత్వం వరుస సెలవులు ప్రకటించడంతో భక్తుల రాక పెరిగింది.



ఘనంగా శంకర జయంతి

వేములవాడ: రాజన్న సన్నిధిలో ఐదు రోజులు కొనసాగే జగద్గురు శంకరాచార్యుల జయంతి వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి.

గరిష్టం/కనిష్టం
37.0/26.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ బృందం సభ్యులు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లతోపాటు ఇల్లంతకుంట మండలంలోని ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లు, ల్యాబ్‌లలో వైద్య ఆరోగ్యశాఖ విజిలెన్స్ బృందం శుక్రవారం తనిఖీ చేసింది. నిబంధనలు పాటించాలని ప్రోగ్రాం ఆఫీసర్ సూచించారు. సభ్యులు చింతోజు భాస్కర్, బాలయ్య, జలపతి తదితరులు పాల్గొన్నారు.

చెరువుల పరిశీలన



కట్ట పరిసరాలు పరిశీలిస్తున్న అధికారులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల, తంగళ్లపల్లి గ్రామాల్లోని చెరువులను శుక్రవారం జెడ్పీ సీఈవో, డీఆర్‌డీవో బి.గౌతంరెడ్డి పరిశీలించారు. చెరువుకట్టల పక్కన మొక్కలు నాటేందుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఎంపీడీవో లచ్చాలు, ఏపీవో నాగరాజు, జేఈ రాజనర్సు, కార్యదర్శి రవీందర్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు అనువుగా ఆర్టీసీ సేవలు



శిక్షణకు హాజరైన ఆర్టీసీ సిబ్బంది

సిరిసిల్లటౌన్: ప్రయాణికులు ఆర్టీసీలోనే ప్రయాణించేలా వారికి అనుకూలంగా సిబ్బంది సేవం దిస్తారని సిరిసిల్ల డిపో మేనేజర్ మనోహర్ పేర్కొన్నారు. టీఎస్‌ఆర్టీసీ ఏప్రిల్ చాలెంజ్ ఫర్ ట్రైనింగ్(టీఏసీటీ) శిక్షణను శుక్రవారం డిపోలో ఇచ్చారు. సంస్థ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ జూమ్ మీటింగ్‌లో సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం డీఎం మనోహర్.. ప్రయాణికులు బస్సును ఆదరించేలా పాటించాల్సిన మెలకువలను సిబ్బందికి వీడియో ద్వారా వివరించారు. ఎస్టీఐ సారయ్య, సేఫ్టీవార్డెన్ రాంరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న న్యాక్ టీమ్ చైర్మన్ అలెగ్జాండర్ జేసుదాసన్

గంభీరావుపేట(సిరిసిల్ల): విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని కృషి చేయాలని న్యాక్ టీమ్ చైర్మన్ ప్రొఫెసర్ అలెగ్జాండర్ జేసుదాసన్ కోరారు. గంభీరావుపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం రెండు రోజుల పర్యటన శుక్రవారం ముగిసింది. జేసుదాసన్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి నిమిషాన్ని లక్ష్య సాధనకు వినియోగించుకోవాలన్నారు. నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పుట్టినప్పటికీ ఉన్నతమైన లక్ష్యం, ఆలోచనలతో పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోవాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. న్యాక్ టీమ్ కో–ఆర్డినేటర్ ఆషిన్‌రిద్ధి, సభ్యులు కేశవ్ గోరుడే, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైస్‌ప్రిన్సిపాల్ పిట్ల దాసు, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ శ్రీవల్లి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధర్మపురి, అధ్యాపకులు కృష్ణమూర్తి, మనోహర్, శ్రీనివాస్, భిక్షమయ్య, శ్రావణ్‌కుమార్, ఆంజనేయులు, విష్ణు, కృష్ణప్రసాద్, విజయ్, మహేశ్, రాజేశ్, ఉమారాణి, శైలజ, భాగ్య, శిరీష, లత పాల్గొన్నారు.

చెత్తవేస్తే రూ.500 జరిమానా



తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని గ్రామాలను చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు చెత్త వేస్తే రూ.500 జరిమానా పేరుతో ప్రతి గ్రామానికి బోర్డులు తయారుచేయించారు. ఇప్పటికే బోర్డులు ఎంపీడీవో ఆఫీస్‌కు చేరుకున్నాయి. త్వరలోనే గ్రామాల్లో ఏర్పాటు చేయనున్నారు.

తడిసిన ధాన్యం.. రాలిన మామిడి

- జిల్లాలో ఈదురుగాలుల బీభత్సం
- మామిడిరైతులకు అపార నష్టం
- నేలకొరిగిన వరిపంట
- పిడుగుపాటుకు పశువులు మృతి
- షార్ట్‌సర్క్యూట్‌తో కాలిన టీవీలు, ఫ్రిజ్‌లు



బోయినపల్లిలో తడిసిన ధాన్యం చూపిస్తున్న రైతు శ్రీనివాస్



తంగళ్లపల్లిలో రాలిన మామిడికాయలు

సిరిసిల్లఅర్బన్/బోయినపల్లి(చొప్పదండి): జిల్లాలో గురువారం రాత్రి వీచిన ఈదురుగాలుల బీభత్సానికి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈదురుగాలులు.. ఉరుములు.. మెరుపులతో కూడిన వర్షం పడడంతో అన్నదాతలు ఆగమయ్యారు. గంభీరావుపేటలో అత్యధికంగా 19.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఈదురుగాలులకు మామిడి కాయలు నేలరాలిపోయాయి. వరిపంట నేల కొరిగింది. పిడుగుపాటుకు గంభీరావుపేట మండలంలో పశువులు చనిపోయాయి. పలు గ్రామాల్లో షార్ట్ సర్క్యూట్‌తో టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని బోనాల, పెద్దూరులో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడిసి కొట్టుకుపోయింది.

భారీ నష్టం.. ఆందోళనలో రైతులు

బోయినపల్లి మార్కెట్‌యార్డులో ఆరబోసిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది. బోయినపల్లికి చెందిన సంబ శ్రీనివాస్ ధాన్యం తడిసి ముద్దయ్యింది. తడగొండ, అనంతపల్లి, మల్కాపూర్, విలాసాగర్‌లలోని కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. పది రోజులుగా కేంద్రాలకు ధాన్యం వస్తున్నా ప్రారంభించకపోవడంతోనే పెద్ద ఎత్తున తడిసిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బోయినపల్లి మండలంలోని మండలంలోని తడగొండ, మర్లపేట, అనంతపల్లి గ్రామాల్లోని మామిడి తోటల్లో మామిడికాయలు రాలిపోయాయి. తోటలు పట్టుకున్న కాంట్రాక్టర్‌లకు భారీ నష్టం ఏర్పడింది.

తంగళ్లపల్లిలో రాలిన మామిడికాయలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలంలోని మామిడితోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇటీవల కురిసిన రాళ్లవానకు మామిడి రైతులు భారీగా నష్టపోగా.. మళ్లీ ఈదురుగాలుల వర్షంతో భారీ నష్టం ఏర్పడింది. మండల కేంద్రానికి చెందిన ఎడమల బాల్‌రెడ్డి నాలుగెకరాల్లో మామిడి తోట పెంచగా.. సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో కాలిన టీవీలు, ఫ్యాన్లు



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద గ్రామస్తుల ఆందోళన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాల పరిసరాలలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పలువురి ఇళ్లలోని ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయాయి. సుమారు నలభై మంది ఇళ్లల్లోని ఫ్యాన్లు, కూలర్లు, టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోయాయి. బాధితులు బాద రమేశ్, పోచయ్య, మల్లయ్య, దీటి మురళీ, వీరమ్మ, అరుణ్, దేవయ్య గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆందోళన చేపట్టారు. బాధిత కుటుంబాలకు సెస్ అధికారులు నష్టపరిహారం చెల్లించాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు పందిర్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

ధాన్యం తడిసింది



బోయినపల్లి మార్కెట్‌యార్డులో పది రోజుల కింద 25 క్వింటాళ్ల మేర వరి ధాన్యం తెచ్చి ఆరబోసిన. రాత్రి కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. ఇక్కడ కేంద్రం ప్రాంభించకపోవడంతో ధాన్యం తెచ్చిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా కొనుగోళ్లు చేస్తే రైతులకు ఏ బాధ ఉండది.

– సంబ శ్రీనివాస్, బోయినపల్లి, రైతు

మామిడికాయలు రాలాయి



తడగొండలో రూ.2 లక్షలకు ఆరు ఎకరాల మేర మామిడితోట పట్టాను. గురువారం రాత్రి కురిసిన ఈదురుగాలులకు భారీగా మామిడి కాయలు రాలిపోయాయి. కాయ కింద పడ్డంక దెబ్బ తగులుతుంది. పెట్టుబడిలో సగం వచ్చేలా లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– లక్ష్మీరాజం, రామడుగు మండలం



బోయినపల్లి: తడగొండలో రాలిన మామిడి కాయలు

పిడుగుపాటుకు మూగజీవాలు బలి

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటలో రమేశ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలకు చెందిన ఆవు, గేదెలు పిడుగుపాటుకు చనిపోయాయి. పాడిపైనే ఆధారపడి జీవిస్తున్న తాము జీవనాధారం కోల్పోయామని బాధితులు రోదించారు. మండలంలోని లింగన్నపేటలోని హరిహర దేవాలయంపై పిడుగుపడడంతో గాలిగోపురం పాక్షికంగా ధ్వంసమైంది.

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండలంలోని పోతుగల్, ముస్తాబాద్, గూడెం, గన్నెవారిపల్లె, నామాపూర్, ఆవునూర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసింది. పోతుగల్ మార్కెట్ యార్డులో రైతులకు టార్పాలిన్లు లేకపోవడంతో ధాన్యం తడిసి ముద్దయ్యింది. పోతుగల్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో వేపచెట్టుపై పిడుగుపడడంతో చెట్టు దెబ్బతింది.



గంభీరావుపేటలో పిడుగుపాటుకు చనిపోయిన ఆవు, గేదెలు

నేరస్తులకు శిక్ష తప్పదు



సిరిసిల్లక్రైం: నేరాలు చేసే వారికి శిక్ష తప్పదని ఎస్పీ అఖిల్‌మహాజన్ హెచ్చరించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం కోర్టు డ్యూటీ అధికారులకు రివార్డులు, ప్రశంసాపత్రాలు అందించారు. కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేలా చేయడం, శిక్షల శాతాన్ని పెంచడం ద్వారా సమాజంలో మార్పు తీసుకురావచ్చన్నారు. పెండింగ్ కేసుల పురోగతిని పరిశీలిస్తూ, ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పోక్సో, హత్య కేసులను ప్రధానమైనవిగా భావించి ముందుకు సాగాలని తెలిపారు. ప్రధాన కేసుల్లో నిందితులకు జీవిత ఖైదుపడేలా కృషి చేసిన అధికారులు, సిబ్బందికి రివార్డులు అందిస్తామన్నారు. వేములవాడటౌన్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన హత్య కేసులో ఒకరికి జీవితఖైదు, ముస్తాబాద్‌లో గంజాయి కేసులో ఏడాది జైలు, రూ.5వేల జరిమానా, తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లకు సంబంధించిన యాక్సిడెంట్ కేసులో ఒకరికి 6 నెలల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించడంపై సంబంధిత అధికారులు, సిబ్బందిని అభినందించారు.

సౌకర్యాలు కల్పించాలి



వేములవాడ: రాజన్న భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ సూచించారు. ఈవో చాంబర్‌లో శుక్రవారం అధికారులతో సమావేశమయ్యారు. ఆలయంలో చేపట్టే పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. అంతకుముందు రాజన్నను దర్శించుకున్నారు. ఏఈవో హరికిషన్, జయకుమారి, ప్రతాప నవీన్, ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, ఏఈ రాంకిషన్‌రావు పాల్గొన్నారు.

3,471 మందికి కంటి వెలుగు పరీక్షలు

సిరిసిల్లఅర్బన్: జిల్లాలో శుక్రవారం 3,471 మందికి కంటివెలుగులో పరీక్షలు నిర్వహించారు. ఇందులో 582 మందికి రీడింగ్ గ్లాసులు, 466 మందికి పాయింట్ అద్దాలను అందించారు. జిల్లా వ్యాప్తంగా 21 క్యాంపులను నిర్వహించగా 189 మంది సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్ బెడ్ రూముల హామీ ఏమైంది..?

- ఇక్కడి పచ్చదనానికి కారణం ఎస్సారెస్పీ కాలువలే..
- ఇసుక మాఫియాతో రోడ్లు ధ్వంసమైనా పట్టదా?
- పోలీసులు ఇసుక మాఫియా కోసం పని చేస్తున్నారు
- ప్రజాసమస్యలపై ధర్నాలు చేస్తే అరెస్టులా..?
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



పాదయాత్ర చేస్తున్న భట్టి విక్రమార్క

సాక్షిప్రతినిధి,కరీంనగర్/జమ్మికుంట: హుజూరాబాద్ నియోజకవర్గంలో డబుల్ బెడ్ రూముల హామీ ఏమైందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం పీపుల్స్ మార్చ్‌లో భాగంగా జమ్మికుంట మండలంలోని నాగంపేటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. తాను నియోజకవర్గంలో ప్రవేశించిన సమయంలో మహిళలంతా తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వస్తాయని ఆశించామని.. అవేమీ సాకారం కాలేదని వాపోయారన్నారు. తమ తరఫున ఆ డిమాండ్లు పరిష్కారానికి రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చేలా పోరాడాలని ప్రజలు కోరారని తెలిపారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో దాదాపు 90 వేల ఎకరాల సాగుభూమి కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ఎస్సారెస్పీ కాలువల కిందే సాగవుతోందని.. కాళేశ్వరం లేదా మరే ఇతర ప్రాజెక్టు కింద ఇక్కడ అదనంగా ఒక్క ఎకరం కూడా సాగు కాలేదన్నారు. కేసీఆర్ మాటలు నమ్మి ప్రజలు అవకాశమిస్తే.. పదేళ్లు దాటినా 90 వేల ఎకరాలకు మించి ఒక్క ఎకరానికి కూడా అదనంగా నీళ్లివ్వలేదన్నారు.

ఇసుక మాఫియాతో ఇక్కట్లు

స్థానికంగా మానేరు నది మీద ఇసుక మాఫియా చెలరేగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సామర్థ్యానికి మించిన లారీలు జమ్మికుంట, హన్మకొండ మార్గంలో రోడ్లను ధ్వంసం చేస్తున్నాయని వాపోయారు. రోడ్డు పక్కన జనావాసాలు లారీలతో వచ్చే దుమ్ముతో తీవ్ర అవస్థలు పడుతున్నారని, వారి పరిస్థితిని బాధితులు స్వయంగా ఇళ్లలోకి పిలిచి చూపించారన్నారు. ఇసుక లారీలకు వ్యతిరేకంగా ధర్నాలు చేస్తే.. పోలీసులు అరెస్టు చేయడమేంటని విస్మయం వ్యక్తం చేశారు. ఇలాంటి కష్టాలు రావడం తెలంగాణ దౌర్భాగ్యమన్నారు. తాము అధికారంలోకి వస్తే పోలీసులను కేవలం పరిపాలన కోసం తప్ప పక్షపాతానికి వినియోగించమని స్పష్టం చేశారు.

ఇంటికి రాలేదంటూ కాంగ్రెస్ నాయకుని ఆవేదన

30 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవ చేస్తున్న, ఎన్ని పార్టీల వాళ్లు ప్రలోభాలు పెట్టినా ఒక్క పైసా ఎవరి దగ్గర తీసుకోలేదని గంగ్రపల్లికి చెందిన మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు పరశురాం ఆవేదన వ్యక్తం చేశాడు. నిన్న మొన్న పార్టీలోకి వచ్చిన వారి ఇంటికి వెళ్లడమేంటని ప్రశ్నించారు. ఈ బాధ భరించలేనని, పురుగుల మందు తాగుతానని.. పార్టీకి రాజీనామా చేస్తానని కన్నీరు పెట్టుకున్నాడు. దీంతో బల్మూరి వెంకట్, నాయకులు ఇంటికి వచ్చి బుజ్జగించారు.

పలకరిస్తూ.. ముందుకు సాగుతూ..

జమ్మికుంట మండలంలోని గుంపుల క్రాస్ రోడ్డు నుంచి భట్టి పీపుల్‌మార్చ్ పాదయాత్ర ప్రజలతో మమేకమై ముందుకు సాగింది. తనుగుల, గండ్రపల్లి వద్ద మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. నాగంపేట దాటిన తర్వాత భోజన విరామం తీసుకున్నారు. సాయంత్రం పాదయాత్ర కొనసాగిస్తూ శాయంపేట, ధర్మారం, కొత్తపల్లికి చేరుకున్నారు. కొత్తపల్లిలో ముస్లింల ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. అనంతరం మడిపల్లి సమీపంలోని శాంతినగర్ కాలనీ వద్ద బసచేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు పత్తి కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సాంబయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గూడెపు సారంగపాణి, సదానందం, పరుశరాం, నియోజవర్గ మైనార్టీ చైర్మన్ ఎండీ సలీం పాషా పాల్గొన్నారు.

మానకొండూరులో తుపాకీ పేలలేదా?

- నిందితుల చేతులపై జీఎస్‌ఆర్ లేదంటున్న పోలీసులు
- అంతా పబ్లిసిటీ స్టంట్ అని కొట్టిపారేసిన ఖాకీలు
- ఇంకా ఆచూకీ చిక్కని నిందితుడు సాయితేజ



నిందితుడు సాయి (ఫైల్)

సాక్షిప్రతినిధి, కరీంనగర్: మానకొండూరు కాల్పుల కేసు కొత్త మలుపు తిరిగింది. ఈ కేసులో అసలు కాల్పులు జరిగాయా? లేదా అన్న విషయంలో మొదటి నుంచి అనుమానాస్పదంగానే ఉంది. ఘటనాస్థలంలో బుల్లెట్ దొరకడం, బాధితుడు తనపై రెండుసార్లు ఫైర్ చేశారని మీడియా ముందు చెప్పడంతో కాల్పులు జరిగాయని అంతా అనుకున్నారు. దీంతో ఈ విషయాన్ని పోలీసులు శాస్త్రీయంగా నిర్ధారించుకున్నారని సమాచారం. సాధారణంగా తుపాకీ పేల్చిన తరువాత కొన్ని గంటలపాటు అలాగే ఉంటుంది. ఈ నేపథ్యంలో తుపాకీ ఎవరు పట్టుకున్నారు అన్న విషయంలో పోలీసులకు స్పష్టత ఉంది. కానీ, మీడియాలో తుపాకీ కాల్పులు అని నిందితుడు భాషబోయిన అరుణ్ పదేపదే చెబుతుండే సరికి, తమ కస్టడీలో ఉన్న ముగ్గురిని పరీక్షిస్తే.. వారి చేతులపై ఎలాంటి జీఎస్‌ఆర్ (గన్‌షాట్ రెసెడ్యూ) ఆనవాళ్లు లభించలేదని ఓ ఉన్నతాధికారి స్పష్టంచేశారు. అదే విధంగా ఘటనాస్థలంలో కూడా కాల్పులు జరిగినట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. గోడలకు తూటాల దెబ్బలు, నేలపైనా ఎలాంటి కెట్రిడ్జ్ (బుల్లెట్ కాల్చాక కిందపడే భాగం) అవశేషాలు లభించలేదని, కేవలం పేలని ఒక రౌండ్ బుల్లెట్ మాత్రమే లభించిందని వివరించారు.

- పాత నేరస్థుడైన అరుణ్ కేవలం తన పబ్లిసిటీ స్టంట్‌లో భాగంగానే.. సానుభూతి కలిగేలా ఉన్నవి, లేనివి కల్పించి చెబుతున్నాడని అభిప్రాయపడ్డారు. అతనికి గోదావరిఖని సాయితేజతో ఎలాంటి సంబంధం లేదన్న విషయాన్ని కొట్టిపడేశారు. ఇద్దరు మూడేళ్ల క్రితం వరకు మంచి స్నేహితులు అని పేర్కొన్నారు. మరోవైపు సాయితేజ కోసం హైదరాబాద్ వెళ్లిన ప్రత్యేక బృందానికి కొత్త విషయాలు తెలిశాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. బీటెక్ వరకు చదువుకున్న సాయితేజ కొంతకాలంగా గంజాయికి అలవాటుపడ్డాడని, అదే సమయంలో సోదరి ఆకస్మిక మరణం అతన్ని కుంగదీసిందని కుటుంబసభ్యులు తెలిపారు. అయితే.. పదే పదే గొడవల్లో ఇరుక్కుని కుటుంబానికి తలనొప్పిగా మారిన కారణంగా సాయితేజకు తామంతా చాలాకాలంగా దూరంగా ఉంటున్నామని వివరించారు. ఈ సమాధానాలతో పోలీసులు నిరాశ చెందారు. నిందితుడు సాయి తన కుటుంబ సభ్యులను కచ్చితంగా సంప్రదించేందుకు వస్తే.. పట్టుకోవచ్చన్న వారి ఆశలపై నీళ్లు చల్లినట్లైంది.

మిత్రుడి కారు.. ఫోన్ స్విచ్ఛాఫ్..

అరుణ్‌పై హత్యాయత్నానికి సాయితేజ గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన అతని స్నేహితుడు స్విఫ్ట్ డిజైర్ కారు తీసుకెళ్లాడని పోలీసులు గుర్తించారు. ఘటన అనంతరం మానకొండూరు నుంచి సాయి హైదరాబాద్ మార్గంలోనే పారిపోయాడని పోలీసుల వద్ద సమాచారం ఉంది. కానీ.. హత్యాయత్నం తరువాత సాయి అనూహ్యంగా సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో అతన్ని పట్టుకోవడం పోలీసులకు సవాలుగా మారింది. సాయికి గంజాయి వ్యాపారులతో సంబంధాలున్న నేపథ్యంలో అతను ఎక్కడ తలదాచుకున్నాడన్నది పోలీసులకు అంతుచిక్కడం లేదు. వీలైనంత త్వరగా పట్టుకుంటామని పోలీసులు మాత్రం ధీమాగా ఉన్నారు.

రైతులకు వడ్డీలేని రుణాలివ్వాలి

- సీపీఐ జాతీయకార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



సిరిసిల్లలో వేదికపై నాయకుల అభివాదం

సిరిసిల్లటౌన్: రైతులకు వడ్డీలేని రుణాలు ఇవ్వాల్సిన ప్రభుత్వాలపైనే ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్యయాత్ర శుక్రవారం సిరిసిల్లకు చేరుకోగా.. స్థానిక బీవైనగర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభలో మాట్లాడారు. అర్హులకు రేషన్‌కార్డులు ఇవ్వాలని, రాష్ట్ర విభజన హామీలను అమలు చేయాలని, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, ఖాజీపేటలో రైల్వేకోచ్ పరిశ్రమ, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. స్విస్ బ్యాంకులోని నల్లధనాన్ని వెనక్కి తేవాలని డిమాండ్ చేశారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడుతామన్నారు. ప్రధాని మోదీ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని కోరారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్, కోడం రమణ, మంద పవన్, మర్రి వెంకటస్వామి, తాండ్ర సదానందం, పంతం రవి పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం ఆగమైంది

ఇల్లంతకుంట(మానకొండూర్): ప్రధాని నరేంద్ర మోదీ పాలనలో దేశం ఆగమైపోయిందని చాడ వెంకటరెడ్డి విమర్శించారు. సీపీఐ ప్రజాచైతన్య యాత్రలో భాగంగా మండలంలోని గాలిపల్లి, ఇల్లంతకుంటల్లో శుక్రవారం నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. ప్రధాని కేవలం అంబానీ, అదానీల కోసమే పనిచేస్తున్నారన్నారు. మతం ముసుగులో బీజేపీ రాజకీయం చేస్తుందన్నారు.

రాష్ట్రం అభివృద్ధి చెందుతోంది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్ బాబు

రుద్రంగి(వేములవాడ): సీఎం కేసీఆర్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు పేర్కొన్నారు. రుద్రంగిలో శుక్రవారం బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. కొందరు అసత్యపు మాటలతో ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, వారిని నమ్మొద్దన్నారు. త్వరలోనే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులు, సెస్ భవనం, 30 పడకల ఆస్పత్రి నిర్మిస్తామని తెలిపారు. అంతకుముందు సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం, సెస్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందిన కట్కూరి హరీశ్ కుటుంబానికి రూ.5లక్షల ప్రమాదబీమా చెక్కును అందజేశారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ గంగం స్వరూపారాణి, జెడ్పీటీసీ గట్ల మీనయ్య, కో–ఆప్షన్ మెంబర్ జెమీలా బేగం, రుద్రంగి, చందుర్తి సెస్ డైరెక్టర్లు ఆకుల గంగారాం, పొన్నాల శ్రీనివాస్, ఎంపీటీసీ మంచె లావణ్య, ఏఎంసీ వైస్‌చైర్మన్ కంటిరెడ్డి, గంగం మహేశ్, మంచె రాజేశం, కమలాకర్, శంకర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బావిలోపడి మహిళా రైతు మృతి

ముస్తాబాద్ (సిరిసిల్ల): పొలం వద్దకు వెళ్లిన మహిళా రైతు ప్రమాదవశాత్తు బావిలోపడి మృతిచెందింది. ఏఎస్సై వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మద్దికుంట గ్రామానికి చెందిన లక్ష్మీ – నర్సింలు దంపతులకు ఇద్దరు కూతుళ్ల, కుమారుడు ఉన్నారు. శుక్రవారం ఉదయం లక్ష్మీ గ్రామ శివారులోని పొలం వద్దకు వెళ్లింది. పంటను పరిశీలిస్తుండగా పొలం గట్టుపై నుంచి వ్యవసాయ బావిలో పడిపోయింది. అదే సమయంలో పొలం వద్దకు వెళ్లిన కుమారుడు మల్లేశ్‌కు బావిలో తల్లి మృతదేహం కనిపించింది. చుట్టుపక్కల రైతులు మృతదేహన్ని బయటకు తీశారు. మృతురాలి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి

ఇల్లంతకుంట (మానకొండూర్): మండలంలోని గాలిపల్లికి చెందిన భట్టు లచ్చవ్వ (60) శుక్రవారం ఉదయం పాముకాటుతో మృతిచెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం ఇంటిముందు అలుకు చల్లేందుకు పేడకోసం తట్ట తీస్తుండగా పాము కాటువేసింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందింది. మృతురాలికి కుమారుడు లక్ష్మణ్, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. హెడ్ కానిస్టేబుల్ భూమయ్య కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

చందుర్తి (వేములవాడ) : మండలంలోని మూడపల్లి బస్టాండ్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడ నుంచి ఆటో డ్రైవర్ పాటి జ్యోతికుమార్ చందుర్తి వైపు వెళ్తున్నాడు. మూడపల్లి బస్టాండ్ వద్దకు చేరుకోగానే కోరుట్లకు వెళ్తున్న కారు ఆటోను వెనుకనుంచి ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన ఆటోడ్రైవర్ జ్యోతికుమార్‌ను చికిత్స నిమిత్తం 108లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

గీత కార్మికుడికి గాయాలు

సిరిసిల్ల అర్బన్: తాటిచెట్టు పై నుంచి పడి గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌కు చెందిన కొమిరె బాబు రోజూ మాదిరిగానే కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కగా కిందపడిపోయాడు. బాబుకు తీవ్రగాయాలుకాగా స్థానికులు చికిత్స నిమిత్తం సిరిసిల్లలోని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యంకోసం కరీంనగర్‌కు తరలించినట్లు గీత కార్మికులు తెలిపారు.

నిబంధనలకు 'నీళ్లు'!

- శుద్ధజలం పేరిట భారీ వ్యాపారం
- గల్లీకో ప్యూరీఫైడ్ వాటర్‌ప్లాంట్
- జిల్లాలో కనిపించని టెక్నీషియన్లు
- ప్రమాణాలు లేని నీటితో రోగాలు
- పట్టించుకోని అధికారులు



ముస్తాబాద్(సిరిసిల్ల): శుద్ధనీరు(ప్యూరిఫైడ్ వాటర్) పేరిట జిల్లాలో భారీగా వ్యాపారం సాగుతోంది. ఇరువై ఏళ్ల క్రితం అప్పుడప్పుడే ప్రారంభమైన ప్యూరిఫైడ్ వాటర్ దందా.. నేడు వేళ్లూనుకు పోయింది. గల్లీకి ఒకటి, రెండు ప్లాంట్ల చొప్పున వెలిశాయి. అయితే జిల్లాలో ఒక్కప్లాంట్‌లోనూ టెక్నీషియన్ లేదు. నీటిని పరీక్షించే విధానలు లేవు. ఎంత మొత్తంలో రసాయనాలు కలపాలన్న విషయం కూడా వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులకు అవగాహన ఉండడం లేదు. ఫలితంగా ఇష్టారీతిగా కెమికల్స్ కలుపుతుండడంతో నీటిలోని మినరల్స్ బయటకు వెళ్లిపోతున్నాయి. ఆ నీటిని తాగిన ప్రజలు రోగాలబారిన పడుతున్నారు.



జిల్లాలో 600 ఆపైనే ప్లాంట్లు

రాజన్నసిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 600 ఆపైనే ప్యూరిఫైడ్ వాటర్‌ప్లాంట్లు ఉన్నట్లు అంచనా. ఒకప్పుడు మండలానికి ఒక్కటి చొప్పున ఉండగా... ప్రస్తుతం గ్రామానికి నాలుగైదు కనిపిస్తున్నాయి. ప్యూరిఫైడ్ వాటర్ ఎంత వరకు సురక్షితమని పరీ క్షించే విధానం జిల్లాలో లేదు. వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులు ఎలాంటి ప్రమాణాలు పాటిస్తున్నారని పరిశీలించే అధికారులు కరువయ్యారు. ఫలితంగా మినరల్స్ లేని నీరు జనాలు తాగుతున్నారు.

మిషన్ భగీరథ సురక్షితమని చెప్పినా..

మిషన్ భగిరథ ద్వారా జిల్లాలో ఇంటింటికీ నల్లా నీరు సరఫరా అవుతుంది. నల్లానీటిని తాగేందుకు కాకుండా ఇతరత్ర అవసరాలకు మాత్రమే వినియోగిస్తున్నారు. మిషన్ భగీరథ నీటిని ప్రత్యేక ప్లాంట్లల్లో శుద్ధిచేసి.. శరీరానికి అవసరమైన మినరల్స్, ఇతర పోషకాలతో అందస్తున్నామని ప్రచారం చేసిన ప్రజలు తాగేందుకు ఆసక్తి చూపడం లేదు.

మోకాళ్లనొప్పులు.. వెన్నుపూస సమస్యలు

వాటర్‌ప్లాంట్లలో నీటిని శుద్ధి చేయడం ద్వారా అందులోని పోషకాలు మాయమవుతున్నాయి. ఫలితంగా మోకాళ్లనొప్పులు, వెన్నుపూస సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ముఖ్యంగా చిన్నపిల్లలు, ఎదిగే వయసు పిల్లలు విటమిన్స్, మినరల్స్ లేని ఖాళీ నీటిని తాగదంతో ఎదుగుదల లోపిస్తుంది. వాటర్‌ప్లాంట్లలో ఫ్లోరైడ్ కారకాలను తొలగిస్తున్నప్పటికీ శరీరానికి ఉపయోగపడే ఇతర మూలకాలు కూడా వెళ్లిపోతుండడంతో సాధారణ నీరు మాత్రమే మిగులుతోంది. దీనికి కారణం వాటర్‌ప్లాంట్ల నిర్వాహకులకు ఎంత మేరకు కెమికల్స్ వాడాలనే విషయం తెలియకపోవడం.

నిబంధనలు ఇవీ..

- గ్రామపంచాయతీ, మున్సిపాల్టీ అనుమతులు పొందాలి.
- 300 గజాల స్థలంలో, ఇళ్లల్లో అసలు ప్లాంట్లు పెట్టుకోరాదు.
- కరెంట్ కనెక్షన్ ప్రత్యేకంగా తీసుకోవాలి.
- బీఐఎస్(బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్ పాటించాలి)
- ఎఫ్ఎస్ఎస్ ఏఐ, ఐఎస్ఐ అనుమతులు పొందాలి.
- బోరుబావి నీటిని పరీక్షించి, అనుమతులు పొందాలి.
- వాల్టా చట్టానికి లోబడిబోరు వేసుకోవాలి.
- కాలుష్య నియంత్రణ మండలి నుంచి ఎన్‌వోసీ అనుమతులు తీసుకోవాలి.
- ఏటా రెన్యూవల్ చేసుకోవాలి. టీడీఎస్ నిబంధనలు పాటించాలి.
- ప్లాంట్‌లో మిషనరీని ఏసీ గదుల్లోనే ఉంచాలి. ల్యాబ్ టెక్నీషియన్ ఉండాలి.
- టీడీఎస్ డిజిటల్ మీటర్ వాడి ఫ్లోరైడ్‌ను పరీక్షించాలి.
- అపరిశుభ్రమైన పరిసరాలు ఉండరాదు. వాటర్‌క్యాన్లను తరచూ శుభ్రం చేయాలి. ప్లాంట్లలోని డ్రమ్ములు, క్యాండిల్స్ శుభ్రం చేయాలి.

శాఖల మధ్య సమన్వయ లోపం

జిల్లాలో వాటర్‌ప్లాంట్లను పర్యవేక్షించాలన్న బాధ్యత ఏ ఒక్క ప్రభుత్వ శాఖ తీసుకోవడం లేదు. రెవెన్యూ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, పంచాయతీరాజ్, కాలుష్య నియంత్రణ మండలి ఇలా పలు ప్రభుత్వ శాఖలు ఉన్నా.. ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకోవడం లేదు. ఎవరైన ఫిర్యాదు చేస్తే సంబంధిత మున్సిపల్, పంచాయతీ అధికారులు మాత్రమే ప్లాంట్లను తనిఖీ చేస్తున్నారు.

నల్లా నీటినే తాగుతున్న



పదిహేనేళ్ల కింద వాటర్‌ప్లాంట్ నీళ్లు తాగిన. మంచిగ అనిపించలేదు. అప్పటి నుంచి వ్యవసాయ బావి వద్ద, లేకుంటే బోరింగ్ వద్ద నీటిని తెచ్చుకుంటున్న. మా ఇంట్లో అందరూ ఫిల్టర్ వాటరే తాగుతారు. నేను ఒక్కడినే బోరు నీళ్లు తాగుతున్న. నాకు ఎలాంటి మోకాళ్ల నొప్పులు రాలే. చాలా మంది ప్లాంట్ నీళ్లు తాగితే నొప్పులు వస్తున్నాయని అంటున్నారు.

– పడిగె మల్లయ్య, చీకోడు

పోషకాలు ఉండేలా చూసుకోవాలి



చాలా మంది మినరల్‌వాటర్ తాగుతున్నారు. ఏ నీటిని తీసుకున్న అవి సురక్షితమో.. కాదో.. తెలుసుకోవాలి. ప్రస్తుతం చాలా వాటర్ ప్లాంట్లల్లో శరీరానికి ఉపయోగపడే మినరల్స్ లేకుండా నీటిని శుద్ధి చేస్తున్నారు. ఫ్లోరైడ్ లేకుండా చూసుకుంటే సరిపోతుంది.. కానీ ఉపయోగపడే పోషకాలు సైతం లేకుండా పోతున్నాయి. నిబంధనలు పాటించే ప్లాంట్లల్లోని నీటిని మాత్రమే తాగాలి.

– డాక్టర్ అనూష, ముస్తాబాద్

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు జరిగేనా..?

వేములవాడ : వేములవాడ బార్ అసోసియేషన్ ఎన్నికలు రాష్ట్ర బార్ అసోసియేషన్‌కు చేరాయి. మార్చి 28న జరిగిన ఎన్నికలు రాష్ట్ర బార్ అసోసియేషన్ బైలా ప్రకారం జరగలేదని పిటిషన్ దాఖలు కావడంతో విచారణ చేపట్టిన రాష్ట్ర బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వేములవాడ బార్ అసోసియేషన్‌కు తిరిగి ఎన్నికలు నిర్వహించాలని ఈనెల 20న ఆదేశించారు. ఇందుకు ముగ్గురు అడ్‌హక్ కమిటీ సభ్యులను ప్రకటించింది. ఈనెల 28న తిరిగి ఎన్నికలు నిర్వహించాలని అడ్‌హక్ కమిటీ సభ్యులు విద్యాసాగర్‌రావు, నగుబోతు విష్ణుకుమార్, రాజశేఖర్‌రెడ్డిని నియమిస్తూ ఆదేశించింది. మార్చి 28న జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా రాజు, ప్రధాన కార్యదర్శి నక్క దివాకర్, నూతన కార్యవర్గం కొలువుదీరిన విషయం తెలిసిందే. అయితే ఈ ఎన్నికలు నిబంధనలకు విరుద్ధంగా జరిగాయని పిట్టల మనోహర్ రాష్ట్ర బార్ అసోసియేషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో నిబంధనలు అతిక్రమించి ఎన్నికలు జరిగాయని, తిరిగి మళ్లీ నిర్వహించాలని రాష్ట్ర బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.నాగలక్ష్మి ఈనెల 20న వేములవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి లేఖ రాసింది. ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. వేములవాడ బార్ అసోయేషన్‌తో పాటు పరిగి బార్ అసోసియేషన్ ఎన్నికలు సైతం జరగనున్నాయని అడ్వొకేట్లు చర్చించుకుంటున్నారు. ఇదిలా ఉండగా మార్చి 28న జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు తమఎన్నిక సక్రమమైందేనని పేర్కొంటూ శుక్రవారం హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది. షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరుగుతాయా లేక కోర్టు నుంచి ఎలాంటి ఆదేశాలు వస్తాయన్నది అడ్వొకేట్స్ అసోసియేషన్‌లో చర్చనీయాంశమైంది.

ఎన్నికల షెడ్యూల్..

- ఈనెల 21న నోటిఫికేషన్, తుది ఓటర్ల జాబితా ప్రకటన
- ఈనెల 24న నామినేషన్ల స్వీకరణ
- ఈనెల 25న నామినేషన్ల ఉపసంహరణ, స్క్రూటీ అనంతరం పోటీలో ఉన్న వారి పేర్ల ప్రకటన.
- ఈనెల 28న పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఫలితాలు
- ఈనెల 29న నూతన కార్యవర్గానికి బాధ్యతల అప్పగింత

రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ



మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల) : రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. మండలంలోని తిమ్మాపూర్, దేవునిగుట్ట తండా, బాకురుపల్లె, గొల్లపల్లి గ్రామాల్లో యాభైమందికి పైగా బీజేపీలో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయా గ్రామాల్లో బీజేపీ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అవినీతి, అక్రమాలను ఎదిరించేందుకు ప్రజలు సిద్ధం కావాలన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో జరుగుతున్న అభివృద్ధిని రాబోయే ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తారన్నారు. మండలశాఖ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, సిరిసిల్ల మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, శీలం రాజు, బుగ్గారెడ్డి, ఎంపీటీసీ రజిత, రవి నాయక్, రమేశ్, రాజిరెడ్డి, కృష్ణహరి, స్వామి, కిరణ్, దూస శ్రీనివాస్, పరుశరాములు, శ్రీనివాస్ రెడ్డి, ప్రకాశ్, సాయి, సంజీవ్‌రెడ్డి, రాంరెడ్డి, కృష్ణారెడ్డి, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా చౌడాలమ్మ కల్యాణం

చందుర్తి (వేములవాడ) : మండలంలోని ఎన్గల్ గ్రామంలో చౌడాలమ్మ కల్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యుడు నాగం కుమార్ కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంటలు బాగా పండాలని మెక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం అధ్యక్షుడు మెండె రాజు, మెండె నర్సయ్య, దర్ర వెంకటేశం, గుంటి మల్లేశం, పెద్ది పర్శరాములు, దర్ర కమలాకర్, నాయకులు గసికంటి ప్రభాకర్, లింగంపల్లి హన్మంతు, గడ్డం నారాయణ, ఎక్కలదేవి శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వగ్రామానికి వలసజీవి మృతదేహం



మల్లేశం (ఫైల్)



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రుద్రంగి (వేములవాడ): మండలకేంద్రానికి చెందిన కుర్మ మల్లేశం గతనెల 15న మస్కట్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందగా శుక్రవారం స్వగ్రామానికి మృతదేహం చేరుకుంది. తోటి ప్రవాసీయులు, ఇండియన్ ఎంబసీ అఫీషియల్ సోషల్ వర్కర్ షేక్ అహ్మద్ సహాయ సహకారాలు, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రత్యేక చొరవతో కుటుంబ సభ్యులకు కడసారి చూపు దక్కింది. కుటుంబ సభ్యులు, బంధువులు, అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. మల్లేశం మృతదేహం వద్ద కుటుంబ సభ్యులు రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కొందరు తమవంతు ఆర్థికసాయం అందించారు. ఫోన్ పే, గూగుల్ పే ద్వారా 7093352752 దాతలు ఆర్థికసాయం అందించాలని కోరారు. అకౌంట్ 049710100100185 ద్వారా సాయం అందజేయాలన్నారు.

భార్యను హత్యచేసిన వ్యక్తికి యావజ్జీవం



పోచంపల్లి రవి

వేములవాడ : భార్యను హత్యచేసిన వ్యక్తికి యావజ్జీవ శిక్ష విధిస్తూ జిల్లా జడ్జి తీర్పుచెప్పినట్లు టౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. సెప్టెంబర్ 19, 2017న భార్యపై అనుమానంతో జగిత్యాల జిల్లా నర్సింగాపూర్‌కు చెందిన రవి వేములవాడలోని ఉప్పుగడ్డ మజీద్ వద్ద హత్యచేశాడు. ఈ కేసులో అతడు జైలుకు వెళ్లాడు. జిల్లా జడ్జి జీవిత కారాగార శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు చెప్పినట్లు సీఐ పేర్కొన్నారు.

ట్రాఫిక్ సిబ్బందికి ఎనర్జీ డ్రింక్స్



సిబ్బందికి ఎనర్జీ డ్రింక్స్ అందిస్తున్న రవిగౌడ్

సిరిసిల్ల టౌన్ : బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బందికి ఎనర్జీ డ్రింక్స్‌ను అందజేశారు. సంఘం రాష్ట్ర కన్వీనర్ కంచర్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బందికి గ్లూకోజ్, ఎనర్జీ డ్రింక్స్‌ను ఎస్సై రజనికాంత్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం ప్రతినిధులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో నాయకులు ఇల్లందుల ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంపులు సీజ్



ఇసుక డంపులను సీజ్ చేస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి (సిరిసిల్ల) : మండలంలోని నేరెళ్ల గ్రామ శివారులో నిల్వచేసిన ఇసుక డంపులను గురువారం రాత్రి తంగళ్లపల్లి పోలీసులు సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. సీజ్ చేసిన ఇసుక డంపులను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

అస్థికలు కలిపేందుకు వచ్చి..

- రోడ్డు ప్రమాదానికి గురై..
- కొత్తపేట వద్ద ప్రైవేట్ బస్సు, లారీ ఢీ
- తీవ్రంగా గాయపడి బస్సు డ్రైవర్ మృతి
- మరో 15మంది పరిస్థితి విషమం
- పది మందికి స్వల్పగాయాలు
- అందరూ ఒకే కుటుంబానికి చెందినవారు
- చెట్టును తప్పించబోయి ఢీకొన్న వాహనాలు



లారీని ఢీకొన్న మినీ ట్రావెల్స్ బస్సు



క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

వెల్గటూర్(ధర్మపురి): తన తల్లి అస్థికలను ధర్మపురి గోదావరి నదిలో కలిపేందుకు మినీ బస్సులో బయలు దేరిన మెదక్ జిల్లా గజ్వేల్ మండలం బేజ్‌గామ్ గ్రామానికి చెందిన ఆకుల దేవేందర్, తన 25మంది కుటుంబసభ్యులు కొత్తపేట వద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఇందులో బస్సు డ్రైవర్ పగిల్ల మల్లయ్య(50) మృతి చెందగా మిగతా వారు తీవ్రగా గాయపడ్డారు. ఇందులో 15మంది కాళ్లు, చేతులు విరిగాయి. మిగతా వారు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఆకుల దేవేందర్ తల్లి అనసూయ ఇటీవల చనిపోయింది. ఆమె అస్థికలను జిల్లాలోని ధర్మపురి గోదావరినదిలో కలిపేందుకు కుటుంబసభ్యులందరూ శుక్రవారం ఉదయం మినీ బస్సులో బయలుదేరారు. బస్సు ఎండపల్లి మండలం కొత్తపేట వద్దకు రాగానే వెల్గటూర్ నుంచి ధర్మారం వైపు వెళ్తున్న లారీని బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఒకేకుటుంబానికి చెందిన ఆకుల మంగమ్మ, మౌనిక, శ్రీనివాస్, వెంకటేశం, యాదగిరి, నాగలక్ష్మి, విజయలక్ష్మి, దినేశ్, భాగ్యలక్ష్మి, సుభద్ర, అక్షర, మయాన్షి, మానస, కనకయ్య సహా సుమారు 25 మంది గాయపడ్డారు. 15 మంది కాళ్లు, చేతులు విరిగి తీవ్ర గాయాలపాలయ్యారు. బస్సు క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్ పగిల్ల ఎల్లయ్యను జేసీబీ సాయంతో శ్రమించి బయటకు తీశారు. కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. గాయపడ్డ మిగతావారిని కరీంనగర్, జగిత్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

చెట్టుకొమ్మను తప్పించబోయి..

వెల్గటూర్, ఎండపల్లి మండలాల్లో గురువారం రాత్రి బలమైన ఈదురుగాలులు వీచాయి. వీటిధాటికి చెట్టుకొమ్మలు విరిగి రోడ్డుపై పడ్డాయి. సాయంత్రం వరకూ వాటిని ఎవరూ తొలగించలేదు. అయితే, ఈ చెట్టుకొమ్మలను తప్పించే ప్రయత్నంలో బస్సు డ్రైవర్ అదుపుతప్పి లారీని ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అధికారుల నిర్లక్ష్యమే ఇందకు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

త్వరలోనే షాదీఖానాకు నిధులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేశ్ బాబు

- ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు

వేములవాడ : పెండింగ్‌లో ఉన్న షాదీఖానాలకు త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని, ఎమ్మెల్యే రమేశ్‌బాబు అన్నారు. శుక్రవారం ముస్లింలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముస్లింలకు ఖబ్రస్థాన్ కోసం రెండెకరాల స్థలం కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి దఫాలో మంజూరైన 80 డబుల్ బెడ్‌రూం ఇళ్లను ముస్లింలకు అందజేస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, మైనార్టీ అధికారి సర్వర్‌పాషా, తహసీల్దార్లు రాజారెడ్డి, నక్క శ్రీనివాస్, టౌన్ సీఐ వెంకటేశ్, ఎస్సై వెంకట్రాజం, కౌన్సిలర్లు, టీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

గంభీరావుపేట (సిరిసిల్ల): మండలంలోని లింగన్నపేట, లక్ష్మీపూర్, ముచ్చర్ల తండాల్లో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. గుడుంబా తయారీ, అనుమానాస్పదంగా ఉన్న ఐదుగురిని తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. వారి నుంచి హామీపత్రం స్వీకరించినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో సీఐతో పాటు ఎస్సై శైలజ, అధికారులు సర్దార్ అలీ, వెంకటేశ్వర్ రావు, రాకేశ్ రాజు, సుమన్, రాజేందర్, దివ్య, అమృత రెడ్డి పాల్గొన్నారు.

దొరికిన సెల్‌ఫోన్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన రేసు రాములు సెల్‌ఫోన్ గురువారం పోగొట్టుకున్నారు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ యాప్‌లో పోయిన సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్ నమోదు చేశారు. దీంతో ఆ సెల్‌ఫోన్ ఎవరి దగ్గర ఉందో పోలీసులు తెలుసుకోగలిగారు. వెంటనే సదరు వ్యక్తి నుంచి ఆ సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి పోగొట్టుకున్న రాములు కొడుకు నవీన్‌కు అందజేశారు. ఎస్సై మాట్లాడుతూ ఇక నుంచి ఎవరు సెల్‌ఫోన్ పోగొట్టుకున్న నేరుగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే కనిపెడతామన్నారు.